క్లుప్తంగా

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



ఫిరంగిపురం: ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరమే రెవెన్యూ సిబ్బంది పరిష్కరించాలని ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పాల్గొని, మాట్లాడారు. సదస్సులో ప్రజలు అందజేసిన కష్టతరమైన అర్జీలను కూడా ఆరు నెలల్లో పరిష్కరించాలని అధికారులను సూచించారు. సదస్సులో పాసు పుస్తకాలకు 37, భూమి కొలతలకు రెండు, మొత్తం 39 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. మండవ నరసింహారావు, కోటేశ్వరరావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఏవో ఏకే బాబు, బి.సతీష్, శేషు, అప్పారావు, హృదయ రాజు, వై.ప్రకాష్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను శుక్రవారం జనసేన పార్టీ మంగళగిరి ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ అనూష హాస్పిటల్‌లో దివ్యాంగుడికి వీల్‌చైర్ అవసరాన్ని తెలియజేశారని తెలిపారు. జనసేన నాయకుడు జొన్న రాజేష్ వీల్ చైర్‌ను అందించడం అభినందనీయమన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ కె.విజయలక్ష్మి, జనసేన రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ్ శేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, మునగపాటి వెంకట మారుతీరావు, వాసా శ్రీనివాసరావు, సామల నాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, అంబటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ తెలుగు మీడియం పాఠశాలలో శుక్రవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ సిబ్బంది స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువు, రక్తశాతం పరీక్షించారు. వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. పూర్తి వివరాలతో కూడిన హెల్త్ ఐడీని విద్యార్థులకు కేటాయిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిస్టర్ వొట్టి థెరసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ అమృత, ఏఎన్ఎం సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

108 మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. బఫర్ వైద్యురాలు శాంతి 108 మందికి బీపీ , షుగర్, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ ఎవరికైనా రాగి రంగు మచ్చలు ఉన్నట్లయితే ఆరోగ్య సిబ్బంది గుర్తించాలన్నారు. పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సాగరరాణి, ఏఎన్ఎంలు కానుకమేరి, సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే- డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఫిరంగిపురం, నుదురుపాడు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఇళ్లల్లో నిల్వ నీటిని తొట్ల నుంచి తొలగించారు. శీతాకాలంలో దోమలు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, నాలుగు రోజుల కోమారు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కాలువల్లో మురుగు పారేలా చూసుకోవాలని చెప్పారు.

దారులన్నీ గుంతలమయం

- పల్లెలకు వెళ్లాలంటే తప్పని తిప్పలు
- అడుగుకో గుంతతో అధ్వానంగా రోడ్లు
- ఎక్కడా కనిపించని మరమ్మతులు



తాడికొండ- నిడమర్రు వెళ్లే పంచాయతీ రాజ్ రహదారి దుస్థితి



అధ్వానంగా పొన్నెకల్లు- అడ్డ రోడ్డు రహదారి

తాడికొండ: తాడికొండ మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేపడుతున్నామంటూ.. చెప్పడమే కానీ, క్షేత్ర స్థాయిలో ఎక్కడా ఆ దిశగా చర్యలు కనిపించడం లేదు. తాడికొండ అడ్డ రోడ్డు నుంచి పొన్నెకల్లు రహదారికి కనీస మరమ్మతుల చేపట్ట లేదు. గతేడాది నవంబర్ 2న స్థానిక ఎమ్మెల్యే గుంతల రహిత గ్రామం అంటూ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. కానీ, నేటి వరకు రోడ్డు గుంతలు పూడ్చిన దాఖలాలు లేవు. అమరావతి- గుంటూరు ప్రధాన రహదారిలో లాం చలపతి కళాశాల సమీపంలో ఏర్పడిన గుంతలతో ప్రయాణికులను నానా ఇబ్బందులు పడుతున్నారు. వరదలకు కొట్టుకుపోయిన తాడికొండ- కంతేరు రహదారికి ఎట్టకేలకు శుక్రవారం మరమ్మతులు ప్రారంభించారు. తాడికొండ నుంచి నిడమర్రు రహదారికి కనీస మరమ్మతులు లేక ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది.

తాడికొండ- తుళ్లూరు, పెదపరిమి- వడ్డమాను రహదారులపై ఏర్పడిన గుంతలతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామీణ రహదారులు అధ్వానం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల రహదారులు, అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పానుగుపాడు రహదారి గుంతలమయంగా ఉంది. కొద్దిపాటి చినుకులు పడినా గుంతల్లో నీరు చేరి జారిపడే పరిస్థితి నెలకొంది. గుంటూరు -కర్నూలు రాష్ట్ర రహదారి నుంచి మునగపాడు వెళ్లే దారి పూర్తిగా గతుకులతో నిండిపోయింది. బేతపూడి గ్రామంలోని దాసుల కాలనీలో అంతర్గత రోడ్లు లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. నుదురుపాడు నుంచి కండ్రిక వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కొన్ని చోట్ల గుంతలు పడి రోడ్డుపై కంకర తేలింది. రాత్రిళ్లు ప్రయాణికులు గుంతల్లో పడి గాయపడుతున్నారు. మండల కేంద్రం నుంచి కొండవీడు వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పొన్నెకల్లు రోడ్డుపై ఇలా



బేతపూడి దాసుల కాలనీలో అంతర్గత రోడ్డు



గుంతలు పడిన కండ్రిక రహదారి

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

23 వాహనాలు సీజ్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రవి కుమార్ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీతానగరం, పుష్కర ఘాట్లు, మహానాడులోని పలు ప్రాంతాల్లో ఐదు బృందాలుగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ తనిఖీల్లో ద్విచక్ర వాహనాలను, అనుమానంగా ఉన్న నివాసాలను సోదా చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎటువంటి పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. సీతానగరం, మహానాడు వలస ప్రజలే అధికంగా ఉన్నారని, అద్దెకు ఇచ్చే



కృష్ణానదిలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

సమయంలో వారి ఆధార్, ఇతర వివరాలను ఇంటి యజమాని తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు, ఎస్ఐ కోటయ్య, మరో 80 మంది సిబ్బంది పాల్గొన్నారు.

దాడికి దారితీసిన ఆస్తి వివాదం

తాడేపల్లిరూరల్: అక్కాతమ్ముడి మధ్య ఆస్తి వివాదం దాడులకు దారి తీసింది. సెటిల్‌మెంట్‌లో కుదిరిన ఒప్పందం ప్రకారం రావాల్సిన నగదు కోసం వెళ్లిన తమపై తన అక్క, ఆమె అల్లుడు దాడి చేశారని బాధితులు మానుపాటి వెంకటేశ్వర్లు, అతని కుమారుడు శ్రావణ్‌కుమార్ తెలిపారు. క్షతగాత్రులు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి వివరాల మేరకు.. సీతానగరంలో విశ్రాంత పోస్టల్ ఉద్యోగి మానుపాటి శ్యామల నివాసం ఉంటోంది. సీతానగరంలో తమ పూర్వీకుల నుంచి వచ్చిన 4.5 ఎకరాల పొలాన్ని ఆమె విక్రయించినట్లు బాధితులు తెలిపారు. దీంతో మూడేళ్ల క్రితం ఆమెతో రాజీకొచ్చామని, రూ.65 లక్షలు శ్యామల చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. అందులో రూ.10లక్షల చెల్లించిందన్నారు. మిగిలిన డబ్బుల కోసం గురువారం మానుపాటి వెంకటేశ్వర్లు తన అక్క అల్లుడు బడే తేజాను ప్రశ్నించగా దాడికి పాల్పడ్డాడని బాధితులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వెంకటేశ్వర్లు, తన భార్య నాగమణితో ఈ విషయంపై



చికిత్స పొందుతున్న నాగమణి

శ్యామలను ప్రశ్నించేందుకు ఆమె ఇంటికి వెళ్లారు. అక్కడే ఉన్న బడే తేజ, రెండవ కుమార్తె భాను మరోసారి దాడి చేశారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు తలకు గాయం కాగా, నాగమణి కుడిచేయి మణికట్టు పైభాగంలో రెండు చోట్ల విరిగిందని కొడుకు శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనపై శ్రావణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో 'సినిమా'కు రూట్ మ్యాప్ సిద్ధం చేయండి

- తగిన విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించాలి
- మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి: అమరావతి పూర్తయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో సినిమా షూటింగ్ లు యధేచ్ఛగా జరుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడాన్ని మూవీ ఆర్టిస్టు అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ (మా-ఏపీ) స్వాగతిస్తోందని 'మా-ఏపీ' వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా చెప్పారు. ఇందుకు తగిన రూట్‌మ్యాప్‌ను ప్రభుత్వం విడుదల చేయాలనీ, తగిన విధివిధానాలను ప్రకటించాలని కోరారు. స్థానిక 'మా-ఏపీ' 'కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సినిమాలకు పనిచేస్తున్న సాంకేతిక నిపుణులు, నటీనటులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వ రూట్‌మ్యాప్ ఉండాలని అభిప్రాయపడ్డారు. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో స్టూడియోల నిర్మాణలపై తగు చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. రైల్వే స్టేషన్, విమానాశ్రమాల సెట్లు ఈరోజుల్లో అధిక శాతం సినిమాలకు షూటింగ్ నిమిత్తం అవసరం అవుతున్న నేపథ్యంలో వీటిపై ఫోకస్ పెట్టాల్సి వుందన్నారు. సినిమా పరిశ్రమకు అరవై శాతం రెవెన్యూ ఆంధ్ర ప్రదేశ్ నుండి వస్తోందని గుర్తుచేశారు. దీనిపై ఆంధ్రలోనే ఇప్పటికే నివాసం ఉంటున్న సినిమా పెద్దల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. వీరితో సహాయ దర్శకులు నరేష్ దోనే, మణివరన్ ఉన్నారు.

నేడు తెనాలిలో అవగాహన సదస్సు

తెనాలి: స్థానిక నాజరుపేట అనుగోలువారి వీధిలోని విద్యాశంకర భారతి నృసింహ సదనంలో శనివారం సాయంత్రం 4 గంటలకు హ్యాపీనెస్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు పర్యవేక్షకుడు కుంచనపల్లి గోపాలరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సదస్సుకు రవిశంకర్ గురూజీ శిష్యుడు దండు శ్రీనివాసరాజు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఆనందం బహుళ వ్యక్తీకరణ, సుదర్శన క్రియ, యోగ, ప్రాణాయామం, ధ్యానం, సామూహిక ప్రక్రియలు తదితర అంశాలను వివరిస్తారని తెలిపారు సదస్సుకు వయసుతో నిమిత్తం లేకుండా కుటుంబ సభ్యులందరూ హాజరు కావచ్చునన్నారు పట్టణం పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి, గౌరవాధ్యక్షుడు భాగవతుల కామేశ్వరరావు, కోశాధికారి సీహెచ్ తిరుమలరావు, కుంచనపల్లి ఛాయారాణి పాల్గొన్నారు.

యువకుడికి తీవ్రగాయాలు

మున్నంగి(కొల్లిపర): మండల పరిధిలోని మున్నంగిలో ఓ యువకుడుకి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కనపాల రవి స్థానిక వంతెన పై గురువారం రాత్రి అపస్మారక స్థితిలో పడి ఉంటాన్ని గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెనాలి సీఐ బెల్లం శ్రీనివాసరావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని గ్రామంలో పలుచోట్ల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ పి.కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని శుక్రవారం విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లేన్ల మరమ్మతుల నిమిత్తం మంగళగిరి పట్టణ పరిధిలోని గండాలయ్య పేట, కొత్తపేట, ఆర్ అండ్ బీ బంగ్లా, హాస్పిటల్ రోడ్డు, మెయిన్ బజార్, ఎయిమ్స్ గేట్, ఎకో పార్కు ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ

తాడేపల్లిరూరల్: దేశ సమైక్యతను దెబ్బతీసే విధంగా కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్న బీజేపీని వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు బూరగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందన్నారు. భారత రాజ్యాంగాన్ని కించపరుస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేసే విధంగా మాట్లాడిన అమిత్ షా వ్యాఖ్యలను మోదీ ఖండించకపోవడం దారుణమన్నారు. నాయకులు వి.శాస్త్రి, నీరుడు దుర్గారావు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి బాల వజ్రబాబు పరామర్శ



తాడికొండ: రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మట్టుకొయ్య రాజారావు గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వడ్డమాను గ్రామానికి రాజారావును హాస్పిటల్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పరామర్శించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట నెక్కల్లు సొసైటీ మాజీ అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి ఉన్నారు.

అనధికార కుళాయి కనెక్షన్లపై చర్యలు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలి: వివిధ వార్డులు, అపార్టుమెంట్లలో అనధికార మంచినీటి కుళాయి కనెక్షన్లను రెగ్యులర్ కనెక్షన్లుగా మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలియజేశారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అనధికార కుళాయి కనెక్షన్ల విషయమై పరిశీలన చేశారు. వీటన్నిటినీ రెగ్యులర్ కనెక్షన్లుగా మార్చుకోవాలని స్పష్టంచేశారు. లేకుంటే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం 1965, సెక్షను 332 ప్రకారం (గెజిట్ నెం.9, తేదీ 9.12.2012) తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

సేవా సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి: వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో ప్రచురించిన గజలక్ష్మి అమ్మవారి క్యాలెండరును శుక్రవారం స్థానిక నాజరుపేటలోని విద్యాశంకర భారతీయ నృసింహ సదనంలో సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భగవద అవతారాలకు సంబంధించిన క్యాలెండర్లను ముద్రించి బ్రాహ్మణ కుటుంబాలకు అందిస్తున్నట్టు తెలిపారు. సమాఖ్య నిర్వహించే అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా దైవారాధనకు సంబంధించిన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడు భాగవతులు కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కుందేటి సుబ్రహ్మణ్యం, మేడూరి శ్రీనివాసమూర్తి, కోశాధికారి సీహెచ్ తిరుమలరావు, బీఎస్ఎల్వీ ప్రసాద్, టి.ఆంజనేయులు, వై.పద్మజ, బుర్ర ప్రభాకరరావు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



పానుగుపాడులో పూలే చిత్రపటానికి హెచ్ఎం సాంబశివరావు నివాళి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమంలో మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ అంటరానితనం, మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. భర్త మహాత్మ జ్యోతిరావు పూలే వద్ద ఓనమాలు దిద్ది, మహిళలకు చదువు నేర్పేందుకు కంకణం కట్టుకున్న తొలి భారతీయ ఉపాధ్యాయని ప్రశంసించారు. ప్రొఫెసర్ ఇన్ ఎస్‌సీఈఆర్‌టీ డాక్టర్ ఉప్పాల శివలక్ష్మి మాట్లాడుతూ అంటరానితనానికి వ్యతిరేకంగా తమ ఇంటి పెరటిలోని బావిలో నీళ్లను దళితులు తోడుకునేలా అవకాశం కల్పించి, సమానతకు స్ఫూర్తిప్రదాతగా సావిత్రిబాయి నిలిచారన్నారు. వీజే కళాశాల వైస్ ప్రిన్సిపల్ గంజి లక్ష్మీ మాట్లాడుతూ పూణేలో ఆనాడు ప్లేగువ్యాధి ప్రబలినప్పుడు స్వయంగా తన భుజాలపై రోగులను ఆసుపత్రులలో చేర్పి వైద్య సేవలు అందేలా కృషి చేసిన సావిత్రి బాయి అదే ప్లేగు వ్యాధికి గురై 1897 మార్చి 10న మృతి చెందడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులు డాక్టర్ ఉప్పాల శివలక్ష్మి, గంజి లక్ష్మి, కె.సుష్మను ఘనంగా సత్కరించారు. జిల్లా మహిళా కన్వీనర్ కాగితాల స్వాతి గౌడ్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

పూలేకు ఉపాధ్యాయుల నివాళి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి శుక్రవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జెట్టి సుబ్బయ్య, హెచ్ఎం దివి కమల్ మోహన్, ఉపాధ్యాయుడు శేషు రవికుమార్, విద్యా సెక్రటరీ వెంకటేశ్వర పాల్గొన్నారు. పానుగుపాడు జెడ్పీ పాఠశాలలో పూలే చిత్రపటానికి హెచ్ఎం సాంబశివరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు జ్యోత్స్న మేరి, ఆదిలక్ష్మి, శైలజ, ఫాతిమా, సుబాని, ఎస్ఎం వలి పాల్గొన్నారు.



మహిళా ప్రధానోపాధ్యాయులకు సత్కారం

హెచ్ఎంలకు సత్కారం

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయనులను శుక్రవారం ఆయా పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు సైదా నాయక్ మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయని సావిత్రిబాయి పూలే గౌరవార్థం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. విశిష్ట సేవలు అందిస్తున్న సీకే హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఏవీఎస్ వరలక్ష్మి, కొప్పరావు మున్సిపల్ ప్రైమరీ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మలను ఘనంగా సత్కరించామని తెలిపారు. యూటీఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శివరామిరెడ్డి, కోశాధికారి ఎస్కే రహమాన్, జిల్లా నాయకులు ఎం.కోటిరెడ్డి, నాయకులు ఎస్కే లక్ష్మిప్రసన్న, యు.ఏడుకొండలు పాల్గొన్నారు.

కిశోరి బాలికల వికాసంపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ప్రజాప్రతినిధులకు, వివిధ శాఖల అధికారులకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో కిశోరి బాలికల వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ షేక్ జబీనా, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు, ఏసీడీపీవో కె.సరిత విచ్చేశారు. షేక్ జబీనా మాట్లాడుతూ బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ, రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో కిశోరి బాలికల గ్రూప్‌లను ఏర్పాటు చేసి, అందరూ పాఠశాలల్లో ఎన్‌రోల్ అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటక్షన్ అధికారి కె. విజయకుమార్,



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు

డీపీఓ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ కె.జవహర్ లాల్, ఏపీఎం సురేష్, సూపర్ వైజర్లు ఎస్.భవాని, ఎం.వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్

తాడికొండ: గ్రామ సభల్లో ఆమోదించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో సత్వరమే పూర్తిచేయాలని గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ ఆదేశించారు. శుక్రవారం తాడికొండలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. రూ.35 లక్షల సీసీ రోడ్లు, రూ.6 లక్షల తాగునీటి వాటర్ ప్లాంటు, రూ.15 లక్షలతో గ్రామ ముఖద్వారం పనులకు ఆమోదం తెలిపారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ శివలీల, కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో సాయికుమార్, ఈవోపీఆర్డీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ

తెనాలి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, మాతాశిశు సంరక్షణ, ఎన్‌సీడీసీడీ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ సూచించారు. స్థానిక నందులపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పట్టణంలోని ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య కార్యదర్శులు, ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అవసరమైన వైద్యసాయం కోసం పట్టణంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యసహాయం పొందవచ్చని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే, దోమలు అభివృద్ధి కాకుండా ఉంటాయని చెప్పారు. 2027 నాటికి మలేరియా కేసులు జీరోగా ఉండాలని 2030 నాటికి మలేరియా రహిత భారత దేశం రూపొందాలని లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. తెనాలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, డాక్టర్ కిషోర్, డాక్టర్ మౌనికకుమార్, డాక్టర్ మహిత, డాక్టర్ హస్నుక్ డాక్టర్ హరిణి, సహాయ మలేరియా అధికారులు ధనావత్ రాజునాయక్, చిరసాని ప్రభాకర్ రెడ్డి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, సుధాశివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు. డాక్టర్ అన్నపూర్ణ, మురళీకృష్ణ సుబ్బరాయణం చినరావూరులో పర్యటించిన ఫ్రైడే డ్రైడేను పరిశీలించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ